
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 5

సోమవారం 28 ఏప్రిల్ 2025





రైతన్నకు అండగా.. సబ్సిడీ సాయం

అన్నదాతను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వ్యవసాయం చేసేందుకు వారు పడుతున్న పాట్లను గుర్తించింది. వ్యవసాయంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. రైతన్నకు సబ్సిడీపై యంత్రాలను అందించేందుకు కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతులకు సబ్సిడీపై అధునాతన వ్యవసాయ యంత్రాలను అందజేసి ఆదుకుంటోంది. నంద్యాల జిల్లాకు రూ.2.80 కోట్ల సబ్సిడీ నిధులను మంజూరు చేసింది. అన్ని మండలాల నుంచి 852 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 841 మందికి సబ్సిడీ యంత్రాలను అధికారులు మంజూరు చేశారు.

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సేద్యం తీరు మారుతోంది. ఆధునిక వ్యవసాయ వినియోగంతో రైతుకు సగం ఖర్చులు తగ్గుతున్నాయి. కూలీల కొరత పెరిగిపోతుండడంతో నూతన యంత్రాల కొనుగోళ్లకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఐదేళ్ల నుంచి రైతులకు వ్యక్తిగత సబ్సిడీ వ్యవసాయ పరికరాలు ఇవ్వలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతులకు సబ్సిడీపై అధునాతన వ్యవసాయ యంత్రాలను అందజేసి అన్నదాతను ఆదుకుంటోంది. అందులో భాగంగానే రైతులకు నూతన వ్యవసాయ యంత్రాలను అందించాలనే ఉద్దేశంతో నంద్యాల జిల్లాకు రూ.2.80 కోట్లు సబ్సిడీ నిధులను మంజూరు చేసింది. దీంతో వ్యవసాయ శాఖాధికారులు రైతులకు 40శాతం సబ్సిడీతో వ్యక్తిగత యంత్రాల పరికరాల పంపిణీ శరవేగంగా అందిస్తున్నారు. వచ్చే ఖరీఫ్‌కి దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు అందజేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. అందులో కొన్ని ప్రధాన వ్యవసాయ యంత్రాల ధరలు, వాటి సబ్సిడీ ఈ విధంగా ఉన్నాయి.

852 మంది రైతుల దరఖాస్తు..

నంద్యాల జిల్లాలో అన్ని మండలాల నుంచి 852 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 841 మందికి మంజూరు చేశారు. వివిధ యంత్రాలకు 697మంది రైతులు డబ్బులు చెల్లించగా 604 యంత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. అందులో 173యంత్రాలను రైతులకు అందజేశారు. దరఖాస్తు చేసుకున్న రైతుల్లో 144 మంది డబ్బులు చెల్లించాల్సి ఉంది. అత్యధికంగా జిల్లాలో బనగానపల్లె మండలంలో 57 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 57మందికి వివిధ యంత్రాలను మంజూ రు చేశారు. అందులో 42 మంది డబ్బులు చెల్లించగా 30 మంది రైతులకు యంత్రాలను అందజేశారు. నంద్యాల మండలంలో 55 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 53 మందికి మంజూరు చేశారు. అందులో 45మంది రైతులు డబ్బులు చెల్లించగా 31 మందికి యంత్రాలను అందజేశారు. బండిఆత్మకూరు మండలంలో 50 మంది దరఖాస్తు చేసుకోగా 50 మంజూరు చేశారు. 44 మంది రైతులు డబ్బులు చెల్లించగా 36 మంది రైతులకు యంత్రాలను అందజేశారు.

- వ్యవసాయ యంత్రాలపై 40 శాతం రాయితీ
- జిల్లాకు రూ.2.80 కోట్ల సబ్సిడీ
- అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం
- 841 మంది రైతులకు యంత్రాలు మంజూరు
- డబ్బులు చెల్లించినవారు 697 మంది
- నెలాఖరు వరకు దరఖాస్తులు





రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి (ఫైల్)

యంత్రం పేరు	ధర(రూ)	సబ్సిడీ(రూ)
విత్తనం వేసే గొర్రు	81,600	26,000
కల్టివేటర్	43,350	21,675
లెవలింగ్ బ్లేడ్స్	30,600	15,300
మినీ కల్టివేటర్	21,400	10,710
పవర్ స్ప్రేయర్	26,010	10,000
బూమ్ స్ప్రేయర్	1,07,100	41,000
హెచ్‌టీపీ స్ప్రేయర్	56,100	28,050
బ్యాటరీ స్ప్రేయర్	4,590	1000
పవర్ వీడర్	91,800	45,900
రోటావేటర్	1,37,700	46,500
సీడ్ డ్రిల్	1,22,400	23,000
మల్టీక్రాప్ ప్లాంటర్	1,12,200	50,000

రైతులు వినియోగించుకోవాలి

ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధి కోసం వ్యక్తిగతంగా రైతులకు యంత్రాలను కొనుగోలు చేసుకునేందుకు సబ్సిడీ మంజూరు చేస్తోంది. ఆసక్తి కలిగిన రైతులు సమీప రైతు సేవాకేంద్రాల ద్వారా ఈనెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యవసాయ యంత్రాలకు డబ్బు చెల్లించిన ప్రతి రైతుకు త్వరితగతిన యంత్రాలను అందజేసాం. రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలి.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల



పవర్ స్ప్రేయర్‌ను రైతుకు అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా (ఫైల్)

శ్రీశైల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు

సున్నిపెంట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం భ్రమరాంబమల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం వేల సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయంలోని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. భక్తుల దర్శనార్థం ఆదివారం ఉదయం 3గంటలకు ఆలయం తలుపులు తెరిచారు. స్వామిఅమ్మవార్లకు సుప్రభాతసేవ, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనార్థం ఆలయంలోకి అనుమతించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో దేవస్థానం ఏర్పాటుచేసిన క్యూకాంప్లెక్సు, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు దేవస్థానం వారు తాగునీరు, అల్పాహారం అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచేకాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శ్రీశైలానికి తరలివచ్చారు. సుమారు 40వేల మంది భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ

భ్రమరాంబమల్లికార్జున స్వామివార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను వెండి పల్లకీలో ఆశీనులను చేసి ఆలయ వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపహారతులు సమర్పించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల పల్లకీ సేవతో ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించి కల్యాణం జరిపించారు.

వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు

ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని క్షేత్రపాలకుడైన బయలు వీరభద్ర స్వామికి ప్రత్యేకపూజలు చేశారు. ఈపూజల్లో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, పుష్పాభిషేక ం నిర్వహించారు. వీరభద్రస్వామికి జరిగిన పరోక్ష పూజల్లో కర్ణాటక, పంజాబ్, పశ్చిమబెంగాల్, బ్రిటన్‌కు చెందిన ప్రవాస భారతీ యులు పాల్గొన్నారు.



దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

శ్రీశైలం డ్యాం భద్రతపై నేడు సమీక్ష

కర్నూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భద్రతపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ దృష్టి సారించింది. ఇప్పటికే పలుమార్లు అధ్యయనం చేసిన నిపుణులు ఇచ్చిన నివేదికల ఆధారంగా చర్యలకు ఉపక్రమిం చింది. తాజాగా ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్‌కుమార్ సోమవారం అమరావతిలో డ్యాం భద్రతపై సమీక్షించనున్నారు. పూర్తి వివరాలతో శ్రీశైలం ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి ఆదివారం రాత్రి అమరావతికి బయలుదేరారు. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం దేవస్థానం వద్ద కృష్ణా నదిపై 1963 జూలై 24న 'శ్రీశైలం ప్రాజెక్టు' నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పునాది వేశారు. ప్రాజెక్టు పూర్తిచేసేందుకు 20 ఏళ్లు పట్టింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. నీటి నిల్వ సామర్థ్యం 308.04 టీఎంసీలు. వరద ప్రవాహ సామర్థ్యం 13.20 లక్షల క్యూసెక్కులు. ఏటా పూడిక చేరడంతో 2011 వరదనీటి లెక్కలు పరిశీలించి గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలుగా నిర్ధారించారు. 12 రేడియల్ క్రస్ట్ గేట్లు స్పిల్‌వే నుంచి వరద జలాలు కిందకు పడి.. మళ్లీ పైకెగిరి నదిలో పడే ప్లంజ్‌పూల్ ప్రాంతంలో భారీ గుంత ఏర్పడింది. 2009లో 25.5 లక్షల క్యూసెక్కుల వరదచేరి ప్లంజ్‌పూల్ గంత వల్ల డ్యాం భద్రతకు ముప్పు ఉందని, డ్యాం దెబ్బతిందని నిపుణులు హెచ్చరించారు. మరమ్మతులకు డ్రిప్-2 కింద రూ.139 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రపంచ బ్యాంక్ బృందం రూ.108 కోట్లు ఇచ్చేందుకు ఫైలుపై సంతకం కూడా చేసింది. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ముందుకు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్‌కుమార్ భద్రతా చర్యలకు ఉపక్రమించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.108 కోట్ల ఫైలును క్లియర్ చేసి రాబోయే సీజన్‌లో డ్యాంకు వరద చేరే సమయానికి మరమ్మతులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

పిడుగుపాటుకు ముగ్గురి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- కౌతాళం, క్రిష్ణగిరి మండలాల్లో విషాదం

కౌతాళం/క్రిష్ణగిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పిడుగుపాటుకు ఆదివారం ముగ్గురు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. వివరాలివీ.. వేసవి సెలవులు కావడంతో కౌతాళం మండలంలోని కాత్రికి గ్రామానికి చెందిన తెలుగు చిన్న వీరేష్, పార్వతి దంపతుల కుమారుడు అశోక్(21), తలారి వీరేష్, మారెమ్మ దంపతుల కుమారుడు బాలయ్య(22)తో పాటు మరో ఎనిమిది బాలురు, యువకులు ఊరి సమీపంలోని పొలాల్లో క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. అయితే గాలి వానతో పాటు వర్షం ఎక్కువ కావడంతో సమీపంలోని చెట్టు కిందకు చేరుకున్నారు. ఆ సమయంలో పిడుగు పడటంతో అశోక్, బాలయ్య అక్కడే స్పృహ కోల్పోయారు. నిరు పాది, గంగాధర్ గాయపడ్డారు. గ్రామస్థులు చికిత్స కోసం గంగాధర్‌ను హాల్వి గ్రామానికి తీసుకెళ్లారు. మిగతా ముగ్గురిని కౌతాళం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఆదోని వైద్యశాలకు తీసుకెళ్లారు. కౌతాళం పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఏఎన్‌ఎం ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తీసుకెళ్లాలని సూచించారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో బాధిత కుటుంబాల సభ్యులు, బంధువులు ఏఎన్‌ఎంతో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత పీహెచ్‌సీ నుంచి 108 వాహనంలో ఆదోనికి తీసుకెళ్లారు. అయితే అంబులెన్స్ కూడా ఆలస్యంగా వచ్చిందని వారు అసహనం వ్యక్తం చేశారు. అయితే అప్పటికే అశోక్, బాలయ్య మృతి చెందినట్లు ఆదోని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలయ్యకు గతేడాది వివాహం కాగా భార్య మీనాక్షి ప్రస్తుతం గర్భిణి. అశోక్ తల్లిదండ్రులతో పాటు వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు.



బాలయ్య (ఫైల్)



అశోక్ (ఫైల్)

క్రిష్ణగిరి మండలంలో రైతు..

మండలంలోని కటారుకొండ గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు(52) పిడుగుపాటుకు ఆదివారం మృతి చెందారు. ఈదురు గాలులతో వర్షం కురువగా పొలంలో పనులు చేసుకుంటున్న శ్రీనివాసులు చెట్టు కిందకు వెళ్లారు. చెట్టుపై పిడుగు పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసులుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అన్నదాతలకు సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను కొనుగోలు చేసి సద్వినియోగంచేసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. ఆదివారం నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో నంద్యాల, గోస్పాడు మండలాల రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ పరికరాలను మార్కెట్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డితో కలిసి మంత్రి పంపిణీ చేశారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ మారుతున్న వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా రైతులకు నూతన వ్యవసాయ యంత్రాలు అవసరమని ప్రభుత్వం గ్రహించి వాటిని సబ్సిడీపై అందిస్తుందన్నారు. కొన్నిసబ్సిడీ యంత్రాలు బయట మార్కెట్లోనే తక్కువ ధరకు వస్తున్నాయని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జీఎస్టీ గురించి వ్యవసాయశాఖ మంత్రితో చర్చిస్తామన్నారు. డీసీ చైర్మన్ ఇలి యాస్, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఎంపీపీ ప్రభాకర్, టీడీపీ నాయకులు విశ్వనాధరెడ్డి, తులసీశ్వరరెడ్డి, మండల వ్యవసాయాధికారులు ప్రసాదరావు, స్వప్నిక పాల్గొన్నారు.



వ్యవసాయ యంత్రాలను అందజేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

దీపం చిక్కులు

- సాంకేతిక సమస్యలతో అందని రెండో విడత రాయితీ
- దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు
- పరిష్కారం చూపని గ్యాస్ ఏజెన్సీలు
- అందుబాటులో లేని పౌర సరఫరాల శాఖ అధికారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12.15లక్షల మంది వినియోగదారులు



ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో భాగంగా 'సూపర్ సిక్స్' అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీపం పథకం పేరుతో ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీని ప్రారంభించింది. అక్టోబర్ 31వ తేదీ నుంచి మార్చి 31వరకు తొలి విడత ఈ పథకం కొనసాగింది. అప్పట్లో చిన్నచిన్న సమస్యలున్నా వాటిని అధిగమించింది. రెండో విడతలో భాగంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి దీపం-2.0 ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సాంకేతిక సమస్యలు చుట్టుకున్నాయి. లబ్ధిదారులు గ్యాస్ తీసుకున్న తర్వాత సబ్సిడీ బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదు. ఏజెన్సీల వారికి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులకు సమస్యలు తెలియజేయాలంటే వారు అందుబాటులోకి రావడం లేదు.

ఆత్మకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): దీపం 2.0 పథకానికి సాంకేతిక చిక్కులు వచ్చిపడ్డాయి. దీంతో రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి రాయితీ సాయం అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. గతేడాది దీపావళి పండుగ సందర్భంగా దీపం-2.0 పేరిట ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అక్టోబరు 31 నుంచి మార్చి 31వ తేదీ వరకు తొలి విడత కాగా, ఏప్రిల్ 1 నుంచి జూలై 31వ తేదీ వరకు రెండో విడత ఉచిత గ్యాస్‌సిలిండర్లను ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఈ పథకానికి అర్హత కలిగిన లబ్దిదారులు నిర్దేశించిన నెలల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉచిత గ్యాస్ సిలిండర్ వినియోగదారులు ముందుగా గ్యాస్ ఏజెన్సీ వారికి నగదు చెల్లించి సిలిండర్ పొందిన 48 గంటల తర్వాత ఆధార్, బ్యాంకు ఖాతాలకు లింకైన గ్యాస్ వినియోగదారుల బ్యాంకు ఖాతాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.41, రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.817 చొప్పున రాయితీ జమ అయ్యేది. తొలి విడతలో ఈ పథకం అమల్లో కొంత సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ చాలామంది లబ్దిదారులకు రెండు, మూడు రోజుల ఆలస్యమైనప్పటికీ నగదు సాయం అందినట్లు తెలిసింది. రెండో విడతలో మాత్రం అధికసంఖ్యలో లబ్ధిదా రులకు నేటికీ ఉచిత గ్యాస్ సిలిండర్ రాయితీ బ్యాంకుఖాతాల్లో జమ కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అయితే దీనిపై కొందరు సాంకేతిక పరమైన సమస్యల వల్ల రాయితీ జమకాలేదని చెబుతున్నప్పటికీ మరికొందరు మాత్రం బడ్జెట్ అందుబాటులో లేకపోవడం వల్ల రాయితీ రావట్లేదని ప్రచారం చేస్తున్నారు.

ఏప్రిల్ 1వ తేదీ నుంచే బుకింగ్..

దీపం-2.0 పథకంలో భాగంగా రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వినియోగదారులు ఏప్రిల్ 1నుంచే సిలిండర్ల కోసం బుకింగ్ చేసుకున్నారు.

మిగతా 7వ పేజీలో

నంద్యాల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సురేఖ



నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎ.సురేఖను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న ప్రిన్సిపాల్ డా.శ్రీదేవి త్వరలో ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం సురేఖను ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఈమె ప్రస్తుతం కడప ప్రభుత్వ మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. బదిలీపై నంద్యాలకు రానున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కొనసాగుతుందని కలెక్టర్ రాజకుమారి గనియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులంతా ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పీజీఆర్ఎస్‌ను ఉదయం 9:30గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 12:30గంటలకు ముగించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లా, మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి దారుణ హత్య

- టిప్పర్‌తో ఢీకొట్టి.. కొడవళ్లతో నరికి
- ఆలూరు నియోజకవర్గంలో పడగవిప్పిన ఫ్యాక్షన్
- గుంతకల్లు నుంచి చిప్పగిరికి వస్తుండగా రైల్వే బ్రిడ్జి వద్ద ఘటన
- అప్రమత్తమైన పోలీసులు
- చిప్పగిరిలో భారీ బందోబస్తు

చిప్పగిరి/ఆలూరు/కర్నూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ పడగవిప్పింది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న ముఠాకక్షలు మళ్లీ బయటపడ్డాయి. ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ(52) ఆదివారం దారుణహత్యకు గురయ్యారు. ప్రత్యర్థులు పక్కా ప్రణాళిక ప్రకారం ఆయన ప్రయాణిస్తున్న కారును టిప్పర్‌తో ఢీకొట్టి.. ఆపై కొడవళ్లతో నరికి దారుణంగా హత్యచేశారు. ఈ ఘటన అనంతపురం జిల్లా గుంతకల్లు సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జరిగింది. ఆయన ప్రమాణిస్తున్న వాహనంలో లక్ష్మీనారాయణ కుమారుడు వినోద్‌కుమార్, అనుచరుడు గోవిందు ఉన్నారు. ఈ దాడిలో లక్ష్మీనారాయణ తలపై, వీపుపై విచక్షణారహితంగా నరికారు. ఆయన కుమారుడు వినోద్‌కుమార్, గోవిందు కూడా గాయపడ్డారని గుంతకల్లు పోలీసులు తెలిపారు. ఆ ముగ్గురిని గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈవిషయం తెలియగానే ఆయన భార్య, కుటుంబ సభ్యులు, చిప్పగిరి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. తాము గుంతకల్లు నుంచి చిప్పగిరి వెళ్తున్నామని, రైల్వే బిడ్జి వద్ద కారును టిప్పరుతో ఢీకొట్టి.. ఎనిమిది మంది వేట కొడవళ్లతో లక్ష్మీనారాయణను విచక్షణారహితంగా నరికి పారిపోయారని అదే దాడిలో గాయపడిన వినోద్ కుమార్, గోవిందు వివరించారు. ఎన్నో ఏళ్ల తరువాత కాంగ్రెస్ నేత హత్యకు గురికావడంతో ఆలూరు నియోజకవర్గం ముఖ్యంగా చిప్పగిరి ఉలికిపాటుకు గురైంది. ఎప్పుడు ఏం జరుగుతుందో..? అంటూ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఘటనా స్థలాన్ని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు మనోహర్, ఏపీ మస్తాన్ హత్య జరిగిన తీరును, ఢీకొట్టిన టిప్పరు, కారును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హత్యకు గురైన లక్ష్మీనారాయణ భార్య నరసమ్మ, కుమారులు వినోద్‌కుమార్, శివ, ఒక కుమార్తె రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం శోకసంద్రంగా మారింది. హత్యను ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు గుంతకల్లులో ధర్నా చేశారు. గుంతకల్లు ఒకటవ పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాక్షన్ హత్యేనా.. మరో కారణమా..?

కర్నూలు జిల్లా కీలక టీడీపీ నేత, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు, ఆయన సతీమణి శకుంతలమ్మ దంపతులను 2007 నవంబరు 18న ఇంట్లోనే అత్యంత కిరాతకంగా హతమార్చారు. ఈ జంట హత్యల కేసులో చిప్పగిరి లక్ష్మీనారాయణ ఏ-7 నిందితుడు. ఆ తర్వాత న్యాయస్థానం ఆ కేసులు కొట్టివేసింది. ఆ సమయంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా ఉన్న మూలింటి మారెప్ప సహచరుడిగా చిప్పగిరి లక్ష్మీనారాయణ ఉన్నారు. అదే సమయంలో ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా పని చేశారు. ఆ తరువాత కేంద్ర మాజీమంత్రి, ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అనుచరుడిగా కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగారు. కోట్ల దంపతులు 2019 ఎన్నికల ముందు టీడీపీలో చేరినా ఆయన మాత్రం కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ వచ్చారు. ప్రస్తుతం ఆపార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. వ్యక్తిగత పనులపై గుంతకల్లు వెళ్లి వస్తుండగా లక్ష్మీనారాయణ హత్యకు గురయ్యారు. మూఠాకక్షల్లో భాగంగానే ఈ హత్య జరిగిందా..? మరే ఇతర కారణాలు ఉన్నాయా..? అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. కుమారుడు వినోద్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు గుంతకల్లు పోలీసులు తెలిపారు. కాగా.. పది రోజుల క్రితం లక్ష్మీనారాయణ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలసి తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని విన్నవించినట్లు తెలిసింది.



లక్ష్మీనారాయణ మృతదేహం

చిప్పగిరిలో భారీ బందోబస్తు

లక్ష్మీనారాయణ దారుణ హత్య నేపథ్యంలో చిప్పగిరిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి చిప్పగిరికి వెళ్లి బందోబస్తును పర్యవేక్షించారు. ఎస్ఐ సతీశ్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ, హతుడు ఇంటి వద్ద, బస్టాండ్ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. లక్ష్మీనారాయణ మృతిపై మాజీ మంత్రి మూలింటి మారెప్ప, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎమ్మెల్యే మసాలా పద్మజ, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్, తాలూకా అధ్యక్షుడు కత్తి రామాంజినేయులు, డివిజన్ అధ్యక్షులు ఎల్లప్ప, మసాలా జగన్ తమ ప్రగాడ సానుభూతి తెలిపారు.



టిప్పర్‌తో కారును ఢీ కొట్టిన దృశ్యం

దీపం చిక్కులు



5వ పేజీ తరువాయి

వారు నగదు చెల్లించి గ్యాస్ సిలిండర్లను పొందినప్పటికీ నేటికీ బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ సాయం అందలేదు. ఈ సమస్యను అడిగేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులెవరూ సామాన్యులకు అందుబాటులో దొరకడం లేదు. అదేక్రమంలో తమ సమస్యను అడిగేందుకు గ్యాస్‌ఏజెన్సీల వద్దకు లబ్ధిదారులు క్యూలు కడుతున్నప్పటికీ వారు సైతం తమకేమీ తెలియదని చేతులెత్తేస్తున్నారు. కనీసం ఫలానా కారణాల వల్ల రాయితీ సాయం రాలేదని కూడా చెప్పకపోవడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఈపథకం అమలు తీరుపై పౌరసరఫరాల శాఖల అధికారులు కూడా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. ఈ సమస్యపై వివరణ తీసుకునేందుకు సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులను ఫోన్‌లో సంప్రదించినప్పటికీ వారు స్పందించకపోవడం గమనార్హం. మొత్తానికి ఈ పథకం ఆశయం బాగానే ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం పురిటినొప్పులు తప్పడం లేదు.

అనర్హులు వీరే..

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం పలు నిబంధనలు ప్రవేశపెట్టి అర్హతను ఎంపికచేశారు. ఇందులో ప్రత్యేకించి ఆదాయపన్ను చెల్లించేవారు, మున్సిపాలిటీల పరిధిలో 1000 చదరపు అడుగుల ఇంటి పన్ను చెల్లిస్తున్న వారు, నాలుగు చక్రాల వాహనం కలిగిన వారు, 300 యూనిట్ల విద్యుత్ బిల్లులు చెల్లించేవారు, మూడెకరాల మాగాణి లేదా పదెకరాల మెట్ట భూమి కలిగిన వారు దీపం -2.0 పథకానికి అనర్హులుగా గుర్తించారు. అదేక్రమంలో రేషన్‌కార్డు, ఆధార్, గ్యాస్ నంబర్‌కు అనుసంధానమైన వారు ఈ పథకానికి అర్హులను నిర్ణయించారు. అయితే ఈ పథకానికి అర్హత కలిగిన వారికి కూడా ఉచిత గ్యాస్ సిలిండర్ల రాయితీ రాకపోవడం గమనార్హం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్యాస్ వినియోగదారుల వివరాలు

విభాగం	నంద్యాల	కర్నూలు
1.దీపం	1,55,323	2,04,629
2.ఉజ్వల	33,732	46,824
3.సీఎస్ఆర్	21,505	11,436
4.జనరల్	3,66,881	4,11,496
మొత్తం :	5,77,441	6,74,385



ప్రతి హామీని నెరవేరుస్తాం

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థికసాయాన్ని రూ. 10వేల నుంచి రూ.20 వేలకు పెంచినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా 1,29,178మంది మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలు న్నాయని, దేశంలో ఉత్పత్తి అయ్యే మత్స్యసంపద 29శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోం దన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తినాలని మంత్రి సూచించారు.

నేడు ఉమ్మడి జిల్లా బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందమూరినగర్ నాగులకట్టవద్ద సోమవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల బీచ్ కబడ్డీ మహిళా, పురుషుల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి ఏపీ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పురుషులు 85కేజీల్లోపు, మహిళలు 75కేజీల్లోపు ఉండాలని, క్రీడాకారులు 10వ తరగతి మార్క్‌లిస్ట్, ఆధార్‌కార్డుతో హాజరుకా వాలని అన్నారు. ఎంపికైన జిల్లా జట్లు మే 2నుంచి 4వరకు కాకినాడలో జరిగే 12వ ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సుధాకర్, నాగరాజు, భరతరెడ్డి, శివలింగమయ్య, సురేష్‌నాయుడు, రాజేష్ పాల్గొన్నారు.

రంగస్థల నటనలో శిక్షణ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో మే 5 నుంచీ రంగస్థల నటనలో శిక్షణ ఇవ్వనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నా బంగారు తల్లి' చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేసిన జల్లు కుమార్ పర్యవేక్షణలో ఇస్తామన్నారు. 16-35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువత ఈ శిక్షణలకు అర్హులని, కనీసం పదో తరగతి పాసై ఉండాలని వివరించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటాయని, శిక్షణ కాలం మే5 నుంచి మే15 వరకు ఉంటుందని, శిక్షణ పూర్తి చేసుకున్న కళాకారులతో మే 16న నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు తమ పూర్తి వివరాలు తెలిపే బయోడేటా, ఆధార్ జిరాక్స్, కలర్ ఫోటో, పది ఆపై విద్యార్హతల ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లతో టీజీవీ కళాక్షేత్రంలో మే 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే ఎంపికలకు హాజరు కావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ముగ్గురికి గాయాలు

నంద్యాల టౌన్ ఏప్రిల్, 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన గోస్పాడు మండలంలోని సాంబవరం మెట్ట వద్ద జరిగినట్లు నంద్యాల ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వివరాలు.. గాజుల పల్లెకు హుసేన్‌వలి, అమీనా, మస్తాన్, సాంబవరానికి చెందిన పెద్దయ్య ఆదివారం సాయంత్రం యర్రగుంట్ల వద్ద ఉన్న దర్గాకు ఆటోలో వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో వెనుక నుంచి స్కారియో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో హుసేన్‌వలి(50) అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెద్దయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రమట్టి ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ఎర్రమట్టి ట్రాక్టర్లు

సి.బెళగల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎర్రమట్టి కొండలో నుంచి సి.బెళగల్‌కు చెందిన నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప తెలిపారు. బ్రాహ్మణదొడ్డి, సంగాల, పోలకల్లు, సి.బెళగల్ గ్రామాల్లో నుంచి ఎర్రమట్టిని తరలిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

లక్ష్మీనారాయణ హత్య దారుణం

- నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి
- సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్. రఘువీరారెడ్డి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య దారుణమని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సభ్యుడు, మాజీ మంత్రి ఎన్.రఘు వీరారెడ్డి అన్నారు. ఆదివారం సంఘటన జరిగిన వెంటనే కర్నూలు, అనంతపురం జిల్లాల ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి, చిప్పగిరి లక్ష్మీ నారాయణ హత్య జరిగిన తీరు, తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. హంతకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి, కర్నూలు జిల్లా వ్యవహారాల ఇన్‌చార్జి అంబటి రామకృష్ణయాదవ్ మాట్లాడుతూ లక్ష్మీనారాయణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కర్నూలు సిటీ అధ్యక్షులు షేక్ జీలాని బాషా మాట్లాడుతూ హత్య చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీనారాయణ హత్య బాధాకరం

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



కల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ దారుణహత్య అత్యంత బాధాకరమని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు లక్ష్మీనరసింహ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. హంతకులను పట్టుకొని కఠిన శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగదు

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఏ ఒక్క రైతుకు అన్యాయం జరుగకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల మార్కెట్‌యార్డులో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ డైరక్టర్ తులసిరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించి మాట్లాడారు. జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు అండగా ఉన్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. జొన్నలకు మార్కెట్లో ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీఎం, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి రూ.3371ల ప్రభుత్వ మద్దతు ధరతో అత్యంత వేగంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 30వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందన్నారు. కొందరు రైతులు సంచులు బాగాలేవని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే వెనక్కి తీసుకొని మంచి సంచులను అందజేయాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజునాయక్‌ను ఆదేశించారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన కురువ విద్యార్థులకు పురస్కారాలు అందించేందుకు దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కురువ సంఘం అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు కె.కిష్టన్న, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ కురువ సంఘం ఆధ్వర్యంలో కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించేందుకు తీర్మానించినట్లు తెలిపారు. 2024-25 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుతమ ప్రతిభ కనబరచిన ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు 500 మార్కులుపైగా, ప్రైవేటు పాఠశాలలో చదివినవారు 550 మార్కులుపైగా వచ్చిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు 850 మార్కులు, ప్రైవేటు కాలేజీల్లో చదివిన విద్యార్థులు 900 మార్కులు పైగా వచ్చిన వారు తమ మార్కుల జాబితా, కుల ధృవీకరన సర్టిఫికెట్ జిరాక్స్ కాపీని మే 5వ తేదీలోపు 9440756199, 9032741194 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలని తెలిపారు. కార్యక్ర మంలో మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రధాన కార్యదర్శి అనిత, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, కే.ధనుంజయ, కేసీ నాగన్న, కొత్తపల్లి నాగేంద్ర, బీసీ తిరుపాల్ తవుడు శ్రీనివాసులు, పాల సుంకన్న, బీసీ తిరుపాల్, పెద్దపాడు పుల్లన్న, బి.బాలరాజు, కే.మద్దిలేటి, కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- సైబర్ నేరాలపై అవగాహన
- అనుమానితులు, నేరచరిత్ర గల వారిపై నిఘా
- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్
- నంద్యాలలో 49 వాహనాలు సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. ఆదివారం తెల్లవారుజామున జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతిరోజు సిబ్బంది వారి స్టేషన్ పరిధిలోని నేరచరిత్ర గలవారిపై, అనుమానితులపై, రాత్రిపూట అనవసరంగా రోడ్లపై తిరిగేవారిపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. నంద్యాలలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవనగర్‌లో సీఐలు కంబగిరిరాముడు, ఇస్మాయిల్, సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు, క్యూఆర్టీ సిబ్బంది దాడిచేసి సరైన ధృవపత్రాల్లేని 49వాహనాలు సీజ్ చేశారన్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని మూడు ప్రదేశాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి టౌన్ సీఐ రాము, సిబ్బంది ఏబీఎంపాలెం, గొల్లపేట, కొట్టాలచెరువుల్లో 20లీటర్ల నాటుసారా చేశారని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నందికొట్కూరు సీఐ ప్రకాష్, సిబ్బంది పట్టణంలోని షికారిపేటలో 30లీటర్ల నాటుసారా సీజ్‌చేసి 500లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ముచ్చుమర్రి ఎస్సై, సిబ్బంది లక్ష్మాపురం గ్రామంలో 18క్వార్టర్ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

చనిపోతూ ముగ్గురికి పునర్జన్మ

- కిడ్నీ, లివర్, కళ్లు దానం చేసిన నర్సిబాయి కుటుంబ సభ్యులు



నర్సిబాయి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అన్నీ తానై చూసుకునే మహిళ మరణించిన తర్వాత ముగ్గురికి ప్రాణదానం చేసింది. పుట్టెడు దుఖంలో ఉన్నప్పటికీ వారి కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎందరికో స్ఫూర్తిదాయకమైంది. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా బొంకూరుకి చెందిన కటికె నర్సిబాయి(55) గృహిణి. ఈ నెల 25వ తేదీ తీవ్ర తలనొప్పి వచ్చి కింద పడిపోవడంతో స్థానిక హాస్పిటల్‌కు తీసుకుని వచ్చారు. అక్కడే ఆమె కోమాలోకి వెళ్లారు. దీంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. రోగిని పరిశీలించిన వైద్యులు తల లోపల కుడి భాగంలో తీవ్ర రక్తస్రావం అయినట్లు గుర్తించారు. చికిత్స పొందుతూ ఆమె శనివారం బ్రెయిన్‌డెడ్ అయ్యారు. ఆ తర్వాత అవయవదానంపై ఏపీ జీవన్‌దాన్ సమన్వయకర్త డా.రాంబాబు బృందం, కిమ్స్ హాస్పిటల్‌లోని అవయవదాన సమన్వయకర్తలు నర్సిబాయి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం భర్త, కుమారుడు అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలు దానం చేశారు. లివర్, ఒక కిడ్నీ కర్నూలుకు మరో కిడ్నీ నెల్లూరు, రెండు కళ్లను కర్నూలు రెడ్‌క్రాస్‌కు గ్రీన్‌చానల్ ద్వారా తరలించారు. చనిపోతూ కూడా మరో ముగ్గురికి ప్రాణదానం చేయడం తమకు గర్వంగా ఉందని మృతురాలి భర్త, కుమారుడు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సి. బెళగల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని బురాన్‌దొడ్డికి చెందిన బోయ కమ్మరికాలప్ప(52) సి.బెళగల్‌లో బాషా బండల డిపోలో పనిచేస్తున్నాడు. ఆదివారం బండల డిపోలో కట్‌చేసిన బండను తొలగించి చేతులు కడుక్కోవడానికి మోటార్‌ను ఆన్‌చేశాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరుకు తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు మృతిచెందాడని, బాధిత కుటుంబాన్ని బండల డిపో యజమాని ఆదుకోవాలని బురాన్‌దొడ్డి గ్రామస్థులు కోరుతున్నారు. కాలప్ప మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

పిడుగుపాటుకు వృషభాలు, గేదె మృతి

పెద్దకడుబూరు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం, చిన్నకడుబూరులో ఆదివారం సాయంత్రం పిడుగుపడి రెండు వృషభాలు, ఒక గేదె మృతిచెందింది. రంగా పురం గ్రామానికి చెందిన ఈతచెట్టు చిన్న మాదన్నకు చెందిన వృషభాలను పొలంలోని చెట్టుకింద కట్టివేశాడు. సాయంత్రం పిడుగు పడడంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉన్నట్లు రైతు చిన్నమాదన్న తెలిపారు. చిన్నకడుబూరులో హనుమంతురెడ్డికి చెందిన గేదె పిడుగుపాటుతో మృతి చెందింది. గేదె విలువ రూ.40వేలు ఉన్నట్లు రైతు హనుమంతురెడ్డి తెలిపారు.

మల్కాపురంలో గడ్డివామిపై..

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని మల్కాపురంలో లక్ష్మన్న కుమారుడు వీరేష్‌కు చెందిన గడ్డివామిపై పిడుగు పడింది. గ్రామ చివరిలో బసాపురం రోడ్డువైపు రైతు వీరేష్ పశువుల మేత కోసం దాదాపు 10ఎద్దుల బండ్ల గడ్డివామి వేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం గడ్డివామిపై పిడుగుపడడంతో దగ్ధమైంది. దీని విలువ దాదాపు రూ.60వేలు ఉంటుందని రైతు వీరేష్ తెలిపాడు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

జిల్లా కేంద్రంలో ఆధునిక దోబీ ఘాట్

● ఏపీ రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి



సమావేశంలో మాట్లాడుతున్న సావిత్రి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలో రజకులకు ఆధునిక దోబీఘాట్స్ ఏర్పాటుకు స్థల సేకరణ చేపడుతున్నట్లు ఏపీ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. ఆదివారం నంద్యాల నేషనల్ పీజీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా రజక ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో 70గ్రామాల నుంచి రజకుల నుంచి వినతులు స్వీకరించామని ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామన్నారు. రజకులకు ఆర్థిక స్వావలంబనకు అనుకూలంగా ఉన్న జీవో 6, 27లను అమలు చేయాలని కూటమి ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రతి రజకుడు లేబర్ కార్డును పొంది ప్రయోజనాలను పొందాలని సూచించారు. రజకులు ఐకమత్యంగా ఉంటూ రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. సావిత్రిని రజకసంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రజక ఐక్యవేదిక అధ్యక్షుడు సీహెచ్ సురేష్, కుసుమాంబ, నందవరం శ్రీనివాసులు, తెల్లాకుల రాజశేఖర్, రామకృష్ణ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల ఏర్పాటు మరిచారు



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరభద్రకాలనీలో ఐదేళ్ల క్రితం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ తీగలను అమర్చకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సీపీఎం నాయకులు రణధీర్, ఇస్మాయిల్ పేర్కొన్నారు. ఆదివారం వారు కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన తీగలను అమర్చకపోవడం వల్ల కాలనీవాసులే ఒక తాత్కాలికంగా ఒక ఇనుక స్తంభాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచే 27 కనెక్షన్లను ఉంచినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ ఇనుక స్తంభానికి వర్షాకాలంలో విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలను ఏర్పాటు చేసిన ఆయా గృహాలకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ముమ్మరంగా కార్డన్ సెర్చ్



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం ఆత్మకూరు పట్టణంతో పాటు కొట్టాలచెరువు గ్రామంలో అర్బన్ సీఐ రాము ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని ఏబీఎం పాలెం, రంగమహల్ థియేటర్ బ్యాక్ సైడ్, కొత్తపల్లి రస్తాతో పాటు కొట్టాలచెరువులో ఈ తనిఖీలు చేశారు. ఏబీఎం పాలెంలో పీట్ల లక్ష్మమ్మ అనే మహిళ నుంచి 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా ఎక్కడైనా అసాంఘీక సంఘటనలు జరిగినట్లయితే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

శేషగిరి మాస్టర్ మృతి పార్టీకి తీరని లోటు



శేషగిరి మాస్టర్ చిత్రపటానికి
పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు శేషగిరి మాస్టర్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జునలు పాల్గొని నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు రామకృష్ణ, సామన్న, నరసింహులు, వాడాల నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నంద్యాల పద్మావతీనగర్‌లోని గ్రంథాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి రాధాబాయి ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భాగంగా పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, జనరల్ నాలెడ్జ్ తదితర అంశాలపై అవగాహన, శిక్షణ తరగతులు వుంటాయన్నారు. ఈ అవకాశాన్ని చిన్నారులు, తల్లితండ్రులు ప్రోత్సాహంతో సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి కోరారు. ఈ శిక్షణా ఉదయం 8 గంటల నుండి 11గంటల వరకు వుంటుందన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నంద్యాల క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు, నేరచరిత్రగలవారు, చెడునడత గల వ్యక్తులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి స్వస్తిపలకాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. హత్యకేసుల్లో నిందితులుగా ఉండి తరచూ దాడులు, బెదిరింపులు, భూ కబ్జాల ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి తీవ్రస్థాయిలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. నేరాల్లో ప్రత్యంగా, పరోక్షంగా పాల్గొని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అకాల వర్షం.. అపార నష్టం

● గాలి వానతో నేలవాలిన వరి, తడిసిపోయిన మొక్కజొన్న ● ఆందోళనలో రైతులు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపులు వెరసి గాలి వానతో ప్రజానీకం అతలాకుతలమయ్యారు. ఆదివారం ఉదయం 12 గంటల ప్రాంతంలో మండలంలోని జీ లింగాపురం, నారాయణపురం, జీసీపాలెం, చిన్నదేవళాపురం, శింగవరం గ్రామాల్లో వాన కురిసింది. దీంతో గ్రామాల్లోని వీధులు క్షణాల్లో జలమయం అయ్యాయి. వరి, మొక్కజొన్న పంటలన్నీ తడిసిముద్దయ్యాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా కాపాడేందుకు పట్టాలు కప్పటం, పొలాల్లో వరి పంట గాలి ధాటికి నేలవాలిపోయింది. దీంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. మామిడి రైతులు కాయలు రాలిపోవటంతో లబోదిబోమంటున్నారు.



తడిసిన వరి ధాన్యం బస్తాలు



పొలంలో నేల వాలిన వరి పంట



లింగాపురంలోని వీధుల్లో నిలిచిన వర్షపు నీరు

ఉగ్రదాడిపై నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజాచైతన్య కళావేదిక నాయకులు

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ స్థానిక హష్మీ ప్రజాచైతన్య కళావేదిక శనివారం నంద్యాల పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. స్థానిక తిక్కస్వామి దర్గ కూడలిలో జరిగిన కార్యక్రమంలో భగత్‌సింగ్ గ్రంథాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాట్లాడారు. పహల్గాం జరిగిన దాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శంకరయ్య, ప్రజా చైతన్య కళా వేదిక ప్రధాన కార్యదర్శి చిన్న బాలహుసేని కమిటీ సభ్యులు హోటల్‌రాముడు, నరసింహులు, ప్రకాశ్, చిన్న జమాల్, పి.దావీదు, రిషి, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల ర్యాలీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ సోమవారం నంద్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు నంద్యాల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.హుసేన్‌బాషా, కార్యవర్గం ఆదివారం తెలిపారు.

సున్నిపెంట: సున్నిపెంటలోని ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకలపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తు కొవ్వత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం మండల ముస్లీమ్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.ఎస్ ఇస్మాయిల్,ప్రధాన కార్యదర్శి నజీర్, ప్రజాసంఘాల నాయకులు ఆశీర్వాదం,దళితసంఘాల నాయకులు లక్ష్మయ్య, మగ్బుల్, సిరాజ్, ఆటో యూనియన్ నాయకులు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

మిడుతూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామానికి చెందిన తువ్వా జయమ్మకు రూ2,22,201, చింతల పల్లి గ్రామానికి చెందిన అయ్య గారి నాగేంద్రకు రూ.83,184 చెక్కును ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వినర్ కాతా రమేష్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద రెడ్డి, టిడిపి నాయకులు శివరామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, రామస్వామి రెడ్డి, వెంటేశ్వర రెడ్డి, సుధాకర్ రెడ్డి, రమణ రెడ్డి, రంగా రెడ్డి, భూపాల్ రెడ్డి, మహేశ్వర రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

● చింతల పల్లి గ్రామానికి తాగునీటి సమస్య తీరింది. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సహకారంతో మండల కేంద్రం మిడుతూరులో ఇటీవల ఎమ్మెల్యే నిధుల కింద రెండు బోరు వేశారు. మిడుతూరు నుంచి చింతల పల్లి గ్రామానికి పైపులైన్ ద్వారా నీటిని సరఫర చేసేందుకు ఆదివారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మోటారు బోరును స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. దీంతో చింతలపల్లి గ్రామానికి తాగు నీటి సమస్య తీరింది. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, మహేశ్వర రెడ్డి, శివరామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, రామస్వామి రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

పగిడ్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎవరైన గొడవలకు పాల్పడితే సహించేది లేదని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం ఉదయం పోలీస్‌లు కవాతు నిర్వహించి, గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏదైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొని వస్తే విచారించి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు చంద్రశేఖర్. సిబ్బంది ఉన్నారు.

గొయ్యి కనిపించడం లేదా?



ప్రమాదకరంగా గొయ్యి

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రద్దీ ప్రాంతమైన శ్రీనివాసనగర్ సొసైటీ గుండా స్టేట్ బ్యాంకు తదితర సమీప ప్రాంతాలకు వెళ్లే మార్గంలో గొయ్యి ప్రమాదకరంగా మారింది. గొయ్యిలో ఉన్న పైప్ బయటకు పొడుచుకుని వచ్చింది. ప్రయాణ సమయంలో ఆమరిస్తే వాహనదారులు తీవ్ర గాయాలకు గురికావాల్సిందే. గొయ్యిని పూడ్చాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గొయ్యిను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ తీగలను అల్లుకున్న చెట్ల పొదలు

నందికొట్కూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఇళ్లకు సరఫరా అయ్యే విద్యుత్ తీగపై చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. అలాగే పిచ్చిమొక్కల తీగలు విద్యుత్ తీగలకు అల్లు కున్నాయి. విద్యుత్ తీగలపై పడ్డ చెట్ల కొమ్మలను తొలగించాలని పదేపదే ఆశాఖ అధికారులకు వినతులు సమర్పించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. చెట్ల మధ్యలో ఉన్న విద్యుత్ లైన్‌కు ప్రత్యామ్నాయ మార్గం చూపించినా కూడా అధికారుల నిర్లక్ష్యం వీడడం లేదని కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



విద్యుత్ తీగకు అల్లుకున్న చెట్ల పొదలు

అభయాంజనేయ స్వామికి అమావాస్య పూజలు



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో గల ఆత్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వెలసిన అభయాంజనేయ స్వామికి అర్చకులు అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి 12గంటలకు మహామంగళహారతిని సమర్పించారు. కాగా అమవాస్య సందర్భంగా స్వామివారికి వివిధ పైనాపిల్ పండ్లతో విశేష అలంకరణ చేశారు.

బండిఆత్మకూరు: మండలంలోని పెద్దదేవళాపురం గ్రామ శివారులో వెలసిన ఏక రాతి శిలా అభయాంజనేయస్వామి వైభవోపేతంగా పూజలు చేశారు. ఆదివారం అమవాశ్యను పురష్కరించుకుని ఆలయ నిర్వాహకులు శివరాజు నాయక్, నాగేశ్వరరావు నాయక్‌ల ఆధ్వర్యంలో వేకువ జామునే స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తేజనాయక్, ఈశ్వర్‌నాయక్, శివనాయక్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు మండల పరిధిలోని రోళ్లపాడు అభయ అరణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా వెలుగోడు మండల అబ్దులాపురం గ్రామానికి చెందిన సత్యనారియణ రెడ్డి భార్య సుస్మిత వారి కుమార్తె దుర్విక్షా రెడ్డి వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బరక సంజీవరాయ స్వామి పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు.



బరక సంజీవరాయుడికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గడివేముల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గని గ్రామ హైస్కూల్‌లో 2007-2008 సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 18ఏళ్ల తరువాత చిన్న నాటి స్నేహితులు ఒక చోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయరాజు, హెచ్ఎం నాగరాజు, ఉమ్లానాయక్, రవి, సాంబశివుడు, సత్యనారాయణ, జనార్దన్ రెడ్డి, శేషాచలం, పార్థసారధిరెడ్డిలను సన్మానించారు. పాఠశాలకు 3 బీరువాలు, రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

1 నుంచి వెలుగోడులో ఉరుసు



రోఖియాబి దర్గా

వెలుగోడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వెలుగోడులో వెలసిన రోఖీయాబీ ఉరుసును మే 1, 2వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మే 1న గంధం, 2న ఉరుసు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ఉరుసుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తారని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ముగిసిన కూచిపూడి నృత్య ప్రదర్శన పరీక్షలు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని శ్రీసాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రంలో కూచిపూడి నృత్య ప్రదర్శన పరీక్ష ఆదివారం ముగిశాయి. నాట్య గురువు డా.పల్లంశెట్టి సురేష్, డా.బత్తుల సంజీవరాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ తరగతుల పరీక్షలు నిర్వహించారు. వీటిలో విద్యార్థులు కూచిపూడి అడుగులు, ముద్రలు, శ్లోకాలు, అసమ్యుక్త సంయుక్త హస్తలు, జతులు, అన్నమయ్య కీర్తనలు, జతిశ్వరంలపై సాంస్కృతిక మంత్రిత్వశాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వారి సహకారంతో పరీక్షలు నిర్వహించారు.

శక్తి యాప్‌పై విస్తృత అవగాహన

నంద్యాల క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా శక్తియాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఆదివారం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి జిల్లాలోని పలుఫ్యాక్టరీలు, హోటళ్లు, భవన నిర్మాణాల ప్రదేశాలు, మెకానిక్ షాప్‌లు తదితర ప్రాంతాలను సందర్శించి శక్తియాప్, నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరాలు, అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన టోల్‌ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిఒక్క మహిళ శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అలాగే రైల్వే స్టేషన్లు, ముఖ్యమైన కూడళ్లు, షాపింగ్ మాల్స్, ఉమెన్‌హాస్టల్స్, పార్కులు తదితర ప్రాంతాల్లో పర్యటించి మహిళలకు శక్తియాప్ ప్రాముఖ్యత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్‌క్రైం, రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల వినియోగంవల్ల కలిగే అనర్థాలు తదితర వాటిపై వివరించారు.

తమ్మడపల్లి సర్పంచ్ మృతి

మహానంది, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):, మహానంది మండలం తమ్మడపల్లి గ్రామ సర్పంచ్ చాబోలు సాలమ్మ(75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. గ్రామ సర్పంచ్ సాలమ్మ మృతికి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డితో పాటు కుమ్మరి శివయ్య సంతాపం వ్యక్తం చేశారు.

చేతిపంపును పట్టించుకోరా?



పాములపాడులో వ్యాపార
దుకాణాల వద్ద మూసుకుపోయిన చేతిపంపు

పాములపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాములపాడు బస్టాండ్‌లో మంచినీటి సమస్య తీరడం లేదు. పాములపాడుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు వస్తుంటారు. బస్టాండ్ వద్ద ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం చేతిపంపును ఏర్పాటు చేసింది. అయితే రాజకీయ పలుకుబడి కల్గిన వ్యక్తులు ఉన్న చేతిపంపును ఆక్రమించుకొని చుట్టూ వ్యాపార సముదాయాల నిర్మాణాలు చేపట్టారు. దీంతో చేతిపంపు సరిగా కనబడక పోవడం, ఎలాగో వెళ్లి నీరు తెచ్చుకొందామన్నా దారిలేక పోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో మంచినీటి సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని చేతిపంపుకు దారి ఏర్పాటు చేసి మంచినీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నాటక రంగంలో రాష్ట్ర స్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్న డా.రవికృష్ణను నంద్యాల మెడికల్ అసోసియేషన్ ఆదివారం ఘనంగా సన్మానించింది. ఐఎంఏ అధ్యక్షుడు డా.మధుసూదన్‌రావు మాట్లాడుతూ కళారాధన సంస్థ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించి సామాజిక చైతన్యం కలిగించాడన్నారు. కార్యక్రమంలో డా.గెలివి సహదేవుడు, డా.వసుధారాణి, డా.ఫనిల్‌కుమార్, డా.నాగమణి, డా.ఓబులరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు మత సామరస్యంతో మెలగాలి



ఖాదర్‌బాబును అభినందిస్తున్న
మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజలు మత సామరస్యంతో మెలగాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నందికొట్కూరుకు చెందిన ప్రముఖ మిమిక్రీ, రంగస్థల కళాకారుడు పి. ఖాదర్ బాబుకు అభినందన సభ, ఆయన త్రిపాత్రాభినయంతో నటించి, రూపొందించిన శ్రీకృష్ణ రాయబారం నుంచి 'శయన ఘట్టం' షార్ట్‌ఫిల్మ్ ప్రదర్శన, మిమిక్రీ షో, సంగీత విభావరి కార్యక్రమాలను నిర్వహించారు. టీజీ వెంకటేశ్ ఖాదర్ బాబును అభినందించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, డాక్టర్ బాలమద్దయ్య, విశ్రాంత ఎస్పీ లక్ష్మీ నాయక్, ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషాలు ప్రసంగించారు. అనంతరం గాయనీ గాయకులు సుధారాణి, హబీబ్, బాలవెంకటేశ్వర్లు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరింపజేసింది. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి, సీనియర్ రంగస్థల నటులు పి. దస్తగిరి, క్రిష్టఫర్, మహమ్మద్ మియా, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

నిలిచిన సంచార సేవలు

- పాడి రైతులకు తప్పని కష్టం
- రోడ్డున పడ్డ ఉద్యోగులు
- ఫిబ్రవరి నుంచి అందని వేతనాలు

చాగలమర్రి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన సంచార వైద్యసేవలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. పశువులకు ప్రమాదాలు జరిగినప్పుడు, రోగాల బారిన పడినప్పుడు దూర ప్రాంతాల్లోని వైద్యశా లకు తీసుకెళ్లాలంటే రైతులు వ్యయప్రయాసలు పడేవారు. ఒక్కోసారి లక్షలు విలువ చేసే పశువులు మృత్యువాత పడుతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మూగజీవాల మరణాల సంఖ్యను తగ్గించేందుకు సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. 2022 మే నెలలో తొలి విడత ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాకు ఏడు వాహనాలు కేటాయించారు. ప్రస్తుతం జీవీకే సంస్థతో ఒప్పందం ముగిసి పోవడంతో వాటి సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. మొదటి విడతలో నంద్యాల జిల్లాలోని ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో వాహనాలు ఎక్కడికక్కడే ఆగి పోయాయి. దీంతో గ్రామాల్లోని పశుపోషకులు జీవాలకు ఏవైన వ్యాధులు సోకితే చికిత్సలు చేయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

పాడి రైతుల అవస్థలు

జిల్లాలో గేదెలు 1.47లక్షలు, ఎద్దులు, ఆవులు 30 వేలు, గొర్రెలు 3.77 లక్షలు, మేకలు 1.23 లక్షలు ఉండగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 50 వేల మందికి పైగా ప్రత్యేక్ష పాడి రైతులు ఉన్నారు. పశువుల సంరక్షణ కోసం 20 రకాల మల సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసే వీలుగా మైక్రోస్కోప్‌తో పాటు ఆటో క్లేవ్ ప్రయోగశాలను సంచార వాహనంలో ఏర్పాటుచేశారు. హైడ్రాలిక్ సౌకర్యంతో పశువులను వెంటనే వాహనంలోకి ఎక్కించి చికిత్స అందించేందుకు వీలుండేది. ఇంకా అత్యవసర పరిస్థితి అయితే అందులోనే వైద్యశాలలకు తరలించి చికిత్స అందించే వారు. వాహనంలో పశువైద్యుడితో పాటు పారావేట్, డ్రైవర్ కం అటెండర్ ఉండే వారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు పశు పోషకులు టోల్‌ఫ్రీ నంబర్ 1962కు ఫోన్‌చేస్తే ఆయా గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందించేవారు. అత్యవసర వైద్యం చేయాల్సి వస్తే వైద్య నిపుణులు స్థానిక సిబ్బందితో కలిసి వాహనంతో ఘటనాస్థలికి చేరుకొని శస్త్ర చికిత్సలు చేసేవారు. వాహనాలు ఆగిపోవడంతో పశువులకు ఏవైన అత్యవసర వైద్యం చేయాల్సి వస్తే ఇబ్బందిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒప్పందం ముగియడంతో..

జీవీకే సంస్థతో ఒప్పందం ముగియడంతో మొదటి విడతలో జిల్లాకు కేటాయించిన వాహనాలు ఫిబ్రవరి 15నుంచి ఆగిపోయాయి. ఇందులో పనిచేసే సిబ్బంది ఉద్యోగా లు కోల్పోయి రోడ్డున పడ్డారు. ఫిబ్రవరి నెల మాసం జీతం కూడా రాలేదు. వీరంతా తమకు ఉద్యోగభద్రత కల్పించాలని సంబంధిత ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. ప్రభుత్వం ఏ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న తమను తిరిగి విధుల్లో కొనసాగించాలని కోరుతున్నారు.

పశువులకు అందని మెరుగైన వైద్యం


ఆళ్లగడ్డలో నిలిచిన సంచార పశు ఆరోగ్య సేవ వాహనం

వైద్య సేవలకు ఆటంకం లేకుండా చూస్తున్నాం

తొలివిడత వాహనాల ఒప్పందం ముగియడంతో ఆయా నియోజకవర్గాల్లో వాహ నాలు నిలిచిపోయాయి. రెండో విడత వచ్చిన వాహనాలతో వైద్య సేవలు అం దిస్తున్నాం. పశువైద్య సేవలకు ఆటంకం లేకుండా చూస్తున్నాం.

- కొండారెడ్డి, ఏడీ, ఆళ్లగడ్డ

అవయవదానం చేయాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బ్రహ్మానందాచారి

బనగానపల్లె, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అవయవదానం చేయాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి సూచించారు. ఆదివారం పలుకూరు గ్రామంలో అవయవదానం అవశ్యకతను వివరిస్తూ కరపత్రాలు పంపిణీచేశారు. అనంతరం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రహ్మానందాచారి మాట్లాడుతూ అవయవదానం చేసి పదిమందిని బతికించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, శరత్‌చంద్రాచారి, అబ్దుల్, పురుషోత్తం, తిమ్మక్క, మంగమ్మ పాల్గొన్నారు.

పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి


ధర్మవరం సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

డోన్ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు బాటలు వేయాలని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం రాత్రి పట్టణంలో ఓ ఫంక్షన్‌హాలులో నృత్య జ్యోతి కూచిపూడి నృత్య శిక్షణా కేంద్రం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు ఎలక్ట్రానిక్ పరికరాలు (సెల్‌ఫోన్లు)కు పరిమితమై శారీరక, మానసిక వ్యాయామాలకు దూరమవుతున్నారన్నారు. అనేక మానసిక రుగ్మతలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీటి నుంచి పిల్లలను దూరం చేసేలా చూడాలన్నారు. అనంతరం సుబ్బారెడ్డిని నృత్య జ్యోతి ఫౌండర్, నిర్వాహకులు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నృత్యజ్యోతి ఫౌండర్ భార్గవ్‌కుమార్, డ్యాన్స్ మాస్టర్ హరినాథ్, రవితేజ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుగ్గనపై బురద జల్లే ప్రయత్నం మానుకోవాలి


సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

డోన్ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): లిక్కర్‌స్కాంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై టీడీపీ నాయకులు బురద జల్లే ప్రయత్నం మానాలని మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. లిక్కర్ స్కాంలో మాజీ మంత్రి బుగ్గనపై టీడీపీ నాయకుల ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాత్రి ఏదో కలలో వస్తే దాన్ని పొద్దునే మీడియా ద్వారా మాట్లాడడం సరికాదన్నారు. ఆధారా లు ఉంటే చట్టప్రకారం బయట పెట్టాలని, అనవసరంగా నింద లు మోపితే తగదని హెచ్చరించారు. బుగ్గన రాజకీయాల్లో మచ్చలేని వ్యక్తి గా నిలిచారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, నంద్యాల జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, కురు కుందు హరి, మల్లికార్జున రెడ్డి, మహేశ్వర రెడ్డి, రమణ, నాగేంద్రమూర్తి, కుమ్మరి రాజు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరెడ్డి సేవలు చిరస్మరణీయం


విద్యార్థికి సాయం అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్లకు చెందిన పోలూరు వెంకటేశ్వరరెడ్డి టీడీపీకి, కమ్మ సంఘానికి చేసిన సేవలు చి రస్మరణీయమని డోన్ రంగయ్య అన్నారు. ఆదివారం పోలూరు వెంకటేశ్వరరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎం పీపీ సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వరరెడ్డి లేని లోటు టీడీపీకి తీరని లోటు అని, టీడీపీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన జ్ఞాపకార్థం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమ్మ సంఘం డోన్ అధ్యక్షుడు వెంకట కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, షేక్షావలి చౌదరి, తిరుమల చౌదరి, సుదాకర్, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, కమ్మ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయం


డోన్‌లో సంతాపాన్ని తెలుపుతున్న పెన్షనర్ల సంఘం నాయకులు

డోన్ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అమాయకులపై ఉగ్రవాదులు చేసిన దాడి హేయమైన చర్య అని డోన్ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేవీఎస్ భానుసింగ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కుటుంబీకులకు పెన్షనర్ల సంఘం సభ్యులు సంతాపాన్ని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు సుబ్బరాయుడు, గాలయ్య, దానప్ప, గోపాల్, మౌలాలి, సుబ్రహ్మణ్యం, తదితరులు ఉన్నారు.

చాగలమర్రి: ఉగ్రవాదులు అమాయకులను చంపడం దారుణమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రదాడిలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయ కులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, లాలయ్య, రామకృష్ణ, సిద్ధప్ప, పుల్లయ్య, చిన్నికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్‌ఖైర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్‌ట్రస్ట్ ప్రతినిధి మౌలాన అబ్దుల్‌మజీద్ ఆరిఫ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

గాలి వాన బీభత్సం

- అరటి రైతులకు భారీగా నష్టం
- పలుచోట్ల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం


చింతలాయపల్లెలో పడిపోయిన విద్యుత్ స్తంభం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్నట్టుండి ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు ఒకసారిగా ఉపశమనం పొందారు. మండలంలోని మధనంతపురం గ్రామంలో అరటి చెట్లు నెలకొరగడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. మరోవైపు చింతలాయపల్లె, అంకిరెడ్డి పల్లె, మదనంతపురం తదితర పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోయాయి, పశువుల కొట్టాలు, రేకుల షెడ్లు కూడా లేచిపోవడంతో పలువురికి నష్టం వాటిల్లింది. పట్టణంలో సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది.


ఇంటిమీద పడిపోయిన విద్యుత్ స్తంభం

బనగానపల్లె: పట్టణంలో ఆదివారం సాయంత్రం వర్షం పడింది. ఉరుములు, మెరుపులు, గాలి భారీగా వీచి వర్షం కురిసింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఉరుములు, మెరుపులు, గాలి భారీగా వీయడంతో ప్రజలు బయటకు రాలేదు. వేసవితాపానికి అల్లాడుతున్న ప్రజానీకానికి ఈవర్షం కాస్త ఊరటనిచ్చింది. అరగం టసేపు ఈ వర్షం పట్టణంలోను, మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసింది. అరగంటకు పైగా పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజానీకానికి కాస్త ఊరట నిచ్చింది.

వైద్య శిబిరానికి విశేష స్పందన

సంజామల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కర్నూలు, నంద్యాల పట్టణానికి చెందిన బీపీ షుగర్, గుండె జబ్బులు, ఎముకలు, కీళ్ల వ్యాధులు చర్మ, దంత, కంటి జబ్బులు, స్త్రీ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులతోపాటు వారి సహాయకులకు గురు రాఘవేంద్ర, గురు రాజా విద్యా సంస్థల అధినేత పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినగడ్డ రుణం తీర్చుకునేందుకే సొంత నిధులు వెచ్చించి ప్రతి నెల చివరి ఆదివారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి కోవెలకుంట్ల, సంజామల మండలాల ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, గురురాజా గురు రాఘవేంద్ర విద్యా సంస్థల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


వైద్య శిబిరానికి హాజరైన రోగులు, బంధువులు

కొవ్వొత్తులతో నివాళి

డోన్ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆదివారం సాయంత్రం శ్రీవేద మాత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సమైక్యాంధ్ర కట్ట వద్ద మరణించిన వారికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో గాయత్రీ పీఠం వ్యవస్థాపకులు గండ్లూరి దత్తాత్రేయ శర్మ, నంద్యాల శంకర్‌శర్మ, కళ్లే శేషావలి శర్మ, సుబ్రహ్మణ్య శర్మ, కళ్లె గంగాధర శాస్త్రి, డి.శ్రీనివాస్, డా.బాలసుబ్బయ్య, వీఆర్వో శ్యాంసుందర్, ఎల్ఐసీ కళ్యాణ్, రమేష్, సుధీంద్ర, ఫొటోగ్రాఫర్ రాము పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న నాయకులు

వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

చాగలమర్రి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామ సమీపంలోగల అభయాంజనేయ, చాగలమర్రిలోని వీరాంజనేయ స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. తమలపాకులు సమర్పించి ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా హనుమాన్ వ్రతాన్ని చేపట్టారు. ఆంజనేయస్వామి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

- పెద్దమ్మకు విశేష పూజలు

చాగలమర్రి గ్రామంలోని పెద్దమ్మ, గ్రామ దేవత చాగలమ్మ, గంగమ్మ దేవతామూర్తులకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని పురవీధుల గుండా పెద్దమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. మూగ జీవాలను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. పంటలు సంవృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు.

రుద్రవరం: రుద్రవరం గ్రామంలోని పడమటివీధిలో కొలువుదీరిన ప్రతాపరుద్ర ఆంజనేయస్వామికి, భాస్కరానందీశ్వరస్వామి ఆలయం ఆవరణంలోని ఆంజనేయుడుకి ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. అర్చకులు వారణాసి గోపిశర్మ అభిషేకం చేసి వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చా రు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొండమాయపల్లెలో ఆంజనేయుడికి అమావాస్య పూజలు చేశారు. అలాగే యల్లావత్తుల, రుద్రవరం, కొండమాయపల్లె గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. తమ గ్రామాలను, పాడి పంటలను చల్లగా చూడాలని మహిళా భక్తులు వేడుకున్నారు.


చాగలమర్రిలో వీరాంజనేయస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. బోనాలను తలపై పెట్టుకొని పెద్దమ్మను దర్శించుకొని నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోవెలకుంట్ల : పట్టణంలోని పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ప్రధానార్చకులు సంబ టూరి వేణుగోపాలచారి, సంబ టూరి సుదర్శనాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తుల కు తీర్థ ప్రసాదాలు అందించారు.


రుద్రవరంలో పూజలందుకున్న ప్రతాప రుద్ర ఆంజనేయస్వామి


దొర్నిపాడులో ప్రత్యేక అలంకారంలో పెద్దమ్మ అమ్మవారు

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా : సీఐ


సీఐ హనుమంతనాయక్

కోవెలకుంట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ అన్నారు. ఆదివారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సంజామల, రేవనూరు, కోవెలకుంట్ల పోలీసుస్టేషన్ల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్న ట్లు తెలిపారు. సంజామల మండలం అక్కంపల్లె, కాజాల, రెడ్డిపల్లె, అలవకొండ, ముక్కమల, అలాగే కోవెలకుంట్ల మండలంలోని రేవ నూరు, భీమునిపాడు తదితర గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రశాంతం వాతావరణానికి భంగం కలిగిస్తే శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రేపు సామగ్రి వేలం

కోవెలకుంట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించిన సామగ్రిని మంగళవారం ఉదయం వేలం వేయనున్నట్లు ఎంపీడీవో వర ప్రసాదరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్లుభవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఎంపీడీవో కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేశారన్నారు. శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని కూల్చి ఆ భవనానికి సంబంధించిన కిటికీలు, తలుపులు , ఇనుప సామగ్రిని ఎంపీడీవో కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ. 1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని కోరారు.

నందవరం ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీ ఆలయాభివృద్ధికి దాతలు విరాళం అందించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన గంజి సుధాకర్ కుటుంబ సభ్యులు రూ. లక్ష 116లు ఆలయాభివృద్ధికి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికు అందజేశారు.

పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

చాగలమర్రి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో అర్హులైన వారు పింఛన్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య పింఛన్ పొందుతూ భర్త మృతి చెందినట్లైతే భార్యకు ప్రభుత్వం నూతన పింఛన్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ధ్రువపత్రాలతో ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

1న క్రికెట్ టోర్నమెంట్

ప్యాపిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో వచ్చేనెల 1న ప్యాపిలిలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 8919126822 నెంబరును సంప్రదించాలని కోరారు.

మే డేను జయప్రదం చేయాలి

ప్యాపిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డోన్ డివిజన్‌లో మే డేను ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక మండల ఆ సంఘం కార్యదర్శి చిన్న రహిమాన్ తెలిపారు. ఆదివారం జలదుర్గం గ్రామంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రహిమాన్ మాట్లాడుతూ కార్మికులు మేడే వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

శివాలయంలో చోరీ

ప్యాపిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుదొడ్డి గ్రామంలోని శివాలయంలో ఆదివారం తెల్లవారం జామున చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు ఆలయంలోని హుండీ పగులగొట్టి నగదును అపహరించుకుపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరుముల శబ్దానికి వృద్ధుడి మృతి

ప్యాపిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం రాత్రి భారీ ఉరుములు, మెరుపుల శబ్దానికి బాషాసాహేబ్(70) అనే వృద్ధుడు మృతి చెందాడు. స్థానిక మధ్యగేరిలో నివాసం ఉంటున్న బాషాసాహేబ్ ఇంటి అరుగుపై కూర్చున్నాడు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపుల శబ్దం రావడంతో వృద్ధుడు కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మసీదు సమీపంలో పడిన పిడుగు

- త్రుటిలో తప్పిన ప్రమాదం

సంజామల,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జామియా మసీదు వద్ద ఆదివారం పిడుగు పడింది. సాయంత్రం వీచిన భారీ గాలులు వర్షం కురిసింది. ఒకసారిగి పిడుగు వేప చెట్టుపై పడింది. నిత్యం మసీదు ఎదురుగా ఉన్న కమలమ్మబాయి గడ్డమీద కానుగ చెట్ల ప్రజలు ఉండేవారు. వర్షం కురుస్తుండటంతో అప్పడే పలువురు ఇళ్లకు వెళ్లారు. తమకు త్రుటిలో ప్రమాదం తప్పిందని పలువురు చర్చించుకున్నారు. పిడుగుపాటుకు వేప, కానుగ చెట్ల కొమ్మలు దగ్ధమయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిశెట్టిపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుం ది. బద్వేల్ మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి మోటార్‌సైకిల్‌పై తాడిపత్రి వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడిని ఆసుపత్రికి తరలించారు.

ఘర్షణలకు పాల్పడొద్దు

రుద్రవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పల్లెప్రజలు ఘర్షణలకు పాల్పడొద్దని ఎస్ఐ వర ప్రసాద్ సూచించారు. ఆదివారం మండలంలోని నరసాపురం గ్రామంలో ఎస్ఐ పర్యటించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామస్థులు చిన్న చిన్న విషయాలకు ఘర్షణకు వెళ్లవద్దని సూచించారు, ప్రశాంతంగా జీవించాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే నష్టపోతారన్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. ఈ నెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక నేటి వరకు తిరిగి రాలేదన్నారు. బంధువుల వద్ద వెతికినా అచూకీ లభించకపోవడంతో ఆదివారం తల్లిదండ్రులు కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రజలతో రౌడీలుగా ప్రవర్తించ కుండా సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం బేతంచెర్ల పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూశాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్‌బాబు, కేసీ తిరుపాలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.